క్లుప్తంగా

రేపు స్వచ్ఛ సాగర్- సురక్షిత సాగర్

మొగల్తూరు: అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం స్వచ్ఛ సాగర్- సురక్షిత సాగర్ కార్యక్రమం చేపట్టామని మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా ఇన్‌చార్జ్ మైల శ్రీనివాస అర్జున్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్‌కాయిస్ సంస్థ సంయుక్తంగా చేపట్టే ఈ కార్యక్రమంలో తీరం పొడవునా ఉన్న చెత్త, ప్లాస్టిక్ , పర్యావరణ హానికరమైన వ్యర్థాలను ఏరివేస్తామని పేర్కొన్నారు. పర్యావరణ ప్రేమికులు ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన కోరారు.

గోదావరి గట్టు వద్ద స్వచ్ఛతా హీ సేవ



గోదావరి గట్టు వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు వద్ద గురువారం వైఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కొండాలమ్మ గుడి ప్రాంతంలో గోదావరి రేవుల వద్ద ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి బాగు చేశారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ మాట్లాడుతూ మనచుట్టూ ఉన్న పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు సీహెచ్ సోమేశ్వరి, ఎస్.యాకోబ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

పాలకొల్లు అర్బన్: వరద బాధితుల సహాయార్థం మండల పరిషత్ సిబ్బంది నుంచి రూ.59,300 విరాళాన్ని సేకరించారు. ఈ విరాళం చెక్కును గురువారం భీమవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు చేతుల మీదుగా కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందజేశారు.

భీమలాపురంలో..

పెనుగొండ: వరద బాధితులుకు అండగా ఉండడానికి భీమలాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులుతో పాటు గ్రామానికి చెందిన చల్లావారి కుటుంబికులు గ్రామస్తులు సేకరించిన రూ.56 వేలు విరాళంను చెక్కును తహసీల్దారు సుగుణ సంధ్యకు గురువారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల మాధవరావు, సీతారామయ్య, చల్లా రాంబాబు, చల్లా శివలాల్, ఎంఈవోలు పాల్గొన్నారు. అదేవిధంగా కొడమంచిలి జనసేన ఆధ్వర్యంలో సేకరించిన రూ.22 వేల 500 లను ఎంపీడీవో నరసింహప్రసాద్‌కు అందించారు.

పాలకొల్లులో రక్తదాన శిబిరం

పాలకొల్లు అర్బన్: ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా మూడో రోజు సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కోడిగట్టు సరస్వతి శిశుమందిర్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యోగా సెంటర్ల సభ్యులు 74 మంది రక్తదానం చేశారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారిన తాతాజీ, పులపర్తి వెంకటేశ్వరరావు, మామిడి శివయ్య పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు 24 తుది గడువు

భీమవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తుకు ఈ నెల 24 వరకు అవకాశముందని జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగ తి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు.

వ్యాయామంతో మధుమేహం నియంత్రణ

ఉండి: వ్యాయామ చేస్తూ జీవన విధానం మార్చుకుంటే షుగర్ వ్యాధి అదుపులో ఉంటుందని ప్రముఖ షుగర్ వ్యాధి వైద్య నిపుణులు ఎస్‌వీ స్వామి అన్నారు. గురువారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్, ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వామి రోగులకు షుగర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ షుగర్ రావడానికి అనేక కారణాలు ఉన్నాయని, వ్యాయామం చేయడం వలన ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు, ఐక్య ఫౌండేషన్ అధ్యక్షుడు అచారి, దేవుడు రామరాజు, రుద్రరాజు నరసరాజు, కాగిత మహంకాళి, బి.హరనాథరాజు, పెన్మత్స జగన్నాథ రాజు, తదితరులు పాల్గొన్నారు.

సార్వా సాగుకు మంగళం



రామన్నపాలెంలోని వ్యవసాయ భూమి



రామన్నపాలెంలో వ్యవసాయ భూముల పరిస్థితి

- వరుస వర్షాలతోముంపునకు గురైన చేలు
- ముందస్తు దాళ్వా మేలంటున్న రైతులు

మొగల్తూరు: మండలంలో ఈ ఏడాది సార్వా సాగు చేసేందుకు రైతన్నలు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలవచ్చినా సార్వా సాగు పనులు పూర్తి కాలేదు. జూలై నెల నుంచి ఆగస్టు వరుకు వరుణుడు తన ప్రతాపం చూపించడంతో ఆకుమడులు మునిగిపోవడం లేదా నాట్లు వేసుకున్న చేలు ముంపునకు గురికావడంతో పెట్టిన పెట్టుబడి అంతా రైతులు నష్టపోయారు. దీంతో ఈఏడాది సార్వా సాగు చేపట్టలేమని రైతులు పేర్కొంటున్నారు. మరోవైపు పచ్చని తివాచీ పరుచుకున్నట్టుగా ఉండే వ్యవసాయ భూములన్నీ చెరువులుగా మారుతున్నాయి. మండలంలో లోతట్టు ప్రాంత భూములన్నీ చెరువులుగా మారడంతో వ్యవసాయంపై మక్కువ ఉన్న రైతులు కూడా సాగుపై ఆసక్తి చూపడం లేదు.

ముంచేసిన వానలు

ఈ ఏడాది రెండు సార్లు వేసిన ఆకుమడులు, రెండు సార్లు నాట్లు వేసుకున్న చేలు ముంపునకు గురయ్యాయి. ప్రతిఏటా మొగల్తూరు మండలంలో సార్వా సాగు 4 వేల ఎకరాలు, దాళ్వా సాగు 2 వేల ఎకరాలలో సాగు అయ్యేది. అయితే పండిన పంట చేతికందకపోవడం, గిట్టుబాటు ధరలేకపోవడం, సాగు నీరందకపోవడం తదితర కారణాలతో వ్యవసాయం తగ్గిపోయింది. ఈ ఏడాది 1198 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే జూన్ నెలలో కాలువలు వదిలినా కాలువలో గుర్రపు డెక్క పెరిగిపోయి శివారు భూములకు సాగు నీరందకపోవడంతో సాగు పనులు చేపట్టడం ఆలస్యమైంది. ఎట్టకేలకు సాగు నీరందడం, వర్షాలు పడటంతో దుక్కులు దున్ని పనులు ప్రారంభించారు. జూలై , ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు రెండు సార్లు నాట్లు వేసుకున్న చేలు మునిగిపోవడంతో పాటు ఆకుమడులు కూడా మునిగిపోయాయి.

587 ఎకరాల్లోనే...

మండలంలో ప్రతి ఏటా జూలై నెలాఖరుకు నాట్లు వేసుకోవడం పూర్తి చేసుకునేవారు. అయితే వర్షం ప్రభావంతో ఈ ఏడాది సెప్టెంబర్ వచ్చినా నాట్లు వేసుకోవడం పూర్తి కాలేదు. అధికారులు అంచనా ప్రకారం ఇప్పటి వరకు కేవలం 587.06 ఎకరాలలో నాట్లు వేయడం పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఆలస్యమైందని, మరోసారి ఆకుమడులు వేసుకుని, నాట్లు వేసుకోవాలంటే మరింత ఆలస్యమవుతుందని దీంతో ఈ ఏడాదికి సాగు చేపట్టలేమని, ముందస్తు దాళ్వాకు సిద్ధమవుతామని రైతులు తేల్చి చెబుతున్నారు. రామన్నపాలెం పంచాయతీలోని 2వ సచివాలయం పరిధిలో 201 ఎకరాలు, మొగల్తూరులోని ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పాలకమ్మ చెరువు పరిధిలో 150 ఎకరాలు, మాత్రమే ఎక్కువగా సాగు చేపట్టారని, మిగిలిన శేరేపాలెం, కొత్తపాలెం, పేరుపాలెం నార్త్‌లో మాత్రం నామమాత్రంగా ఊడ్చారని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు.

చేలలో నీరు లాగడం లేదు



మొదట్లో శివారు ప్రాంతాలకు నీరందకపోవడంతో సాగు చేపట్టలేదు. ఓ నెల తర్వాత నాట్లు వేశాక దర్బరేవు డ్రెయిన్ ఆటుపోటులకు చేలల్లోకి నీరు చేరింది. చిన్నపాటి వర్షాలకు కూడా చేలల్లో నీరు నిలిచిపోతుంది. ఈ ఏడాది రెండు సార్లు ఆకుమడులు వేసి నష్టపోయాను.

– పిప్పళ్ళ గోపి, పిప్పళ్ళవారితోట

ముందస్తు దాళ్వా మేలు



మా గ్రామంలో జున్నూరు కాలువ శివారు ప్రాంతంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. నీటి కొరత ఉంటే మా ప్రాంతాలకు నీరు రావు. అధిక వర్షాలు వస్తే పంట భూములన్నీ మునిగిపోతాయి. కాబట్టి ఈ ఏడాది సార్వా సాగుకు కంటే ముందస్తు దాళ్వా పనులు చేపట్టడం మంచిదని ఆలోచిస్తున్నారు.

– గూడూరి మావుళ్ళు, పాలకమ్మచెరువు

వంతెన మార్గం ప్రమాదకరం



వంతెన మార్గం దుస్థితి

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాధలో మంగళగుంటపాలేనికి వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా వెళ్లేవారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో అటూ, ఇటూ కూడా రాళ్లు పైకిలేచి పోయాయి. అలాగే రోడ్డు కూడా శిథిల స్థితికి చేరుకుంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. సైకిళ్లపై వెళ్లే స్కూల్ విద్యార్థులు ప్రతిరోజూ పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎంతో కాలంగా, ఈ వంతెన మార్గం వైపు రోడ్డుకు మరమ్మతులు చేయడంలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

సబ్ జైలు తనిఖీ



సబ్‌జైలులో వంటశాలను పరిశీలిస్తున్న రత్నప్రసాద్

నరసాపురం: నరసాపురం సబ్ జైలును గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తనిఖీ చేశారు. అనంతరం జైలు అదాలత్ నిర్వహించి, వంటశాలను పరిశీలించారు. ఖైదీలకు అందించే ఆహారం నిబంధనలకు లోబడి అందించాలని ఆదేశించారు. ఖైదీలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థికస్థోమత లేనివారు కోర్టు జైలు విజిటింగ్ లాయర్‌ను సంప్రదిస్తే ఉచిత న్యాయవాదిని నియమిస్తారని చెప్పారు. ఆయన వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు తదితరులు ఉన్నారు.

అంజనాస్ ఫౌండేషన్‌తో ఎంఓయూ

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల అవనిగడ్డకు చెందిన అంజనాస్ ఫౌండేషన్ సంస్థతో సంయుక్త ఒప్పంద కుదుర్చుకుంది. గురువారం సంస్థ చైర్మన్ బచ్చు నవీన్, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకరావులు ఈ మేరకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కనకారవు మాట్లాడుతూ ఇకపై కళాశాల విద్యార్థులకు ఒప్పందంలో భాగంగా సంస్థ లాంగ్‌టర్మ్ కోచింగ్ ప్రాజెక్టులు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఈ ఎంఓయూ చాలా బాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఆటోలపై నియంత్రణ ఏదీ?



మొగల్తూరురోడ్డులో ఇష్టానుసారం నిలిపిఉంచిన ఆటోలు

నరసాపురం: పట్టణంలో ఆటోల సమస్య నానాటికీ తీవ్ర మవుతోంది. ఆటోలను ఇష్టానుసారం రోడ్లమీదే నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మితిమీరిన వేగంతో ఆటోలను తిప్పడం, కనీస వయస్సు లేని చిన్నచిన్న పిల్లలు సైతం ఆటో డ్రైవర్ల అవతారం ఎత్తడంతో ప్రతి రోజూ ఆటోల కారణంగా ఏవో ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. పట్టణంలో దాదాపు 400 పైగా ఆటోలున్నాయి. అయితే ఆటోలను నిలిపి ఉంచడానికి ప్రత్యేకంగా ఎక్కడా స్టాండ్స్ లేకపోవడం ఇబ్బందులను తెచ్చి పెడుతుంది. ఆటో డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపి ఉంచడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బస్టాండ్, గుర్రపు బళ్ల స్టాండ్, ఎండుచేపల మార్కెట్ ప్రాంతాల్లో ఆటోల సమస్య ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో వందల కొద్దీ ఆటోలను రోడ్ల మీదే నిలిపి ఉంచుతున్నారు. రద్దీగా ఉండే బస్టాండ్, గుర్రపు బళ్ల స్టాండ్ వద్ద ఆటోలు కారణంగా ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. గడిచిన రెండేళ్లలో పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఈ రెండు ప్రాంతాల్లోనే జరగడం విశేషం. అసలే ఇరుకుగా ఉండే ఈ ప్రాంతాలు ఆటోలు ఇష్టానుసారం నిలిపి ఉంచడంతో పరిస్థితి మరింత ప్రమాదంగా మారింది. కనీస వయసు కూడా లేనివారు ఆటోలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఆటోలపై దృష్టి పెడతామని, ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులిస్తామని, కనీస వయస్సు లేని వారు ఆటోలను నడపకుండా చర్యలు తీసుకుంటామని గతంలో ప్రకటించిన పోలీస్‌శాఖ ఆ విషయం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్యాన్సర్ రోగికి సాయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రుకి చెందిన క్యాన్సర్ రోగి గుమ్మాపు రామకృష్ణకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.10 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ సహాయాన్ని కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు గురువారం చింతపర్రులో రోగికి అందజేశారు. పేద, మధ్య తరగతి వర్గాలకు విద్య, వైద్యం నిమిత్తం కోట్లాది రూపాయలు సహాయం చేస్తున్నారని బుద్ధరాజు వివరించారు.

ముదునూరిని కలసిన నాయకులు



ముదునూరికి అభినందనలు తెలుపుతున్న గుడాల గోపి, పార్టీ నాయకులు



ముదునూరికి అభినందనలు తెలుపుతున్న ఆచంట నియోజకవర్గ నాయకులు

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజును పలువురు పార్టీ నాయకులు గురువారం నరసాపురంలోని ఆయన నివాసంలో కలిసి అభినందించారు. పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, తోట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మురళి, పలువురు నాయకులు ప్రసాదరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు కౌన్సిలర్లు, ఇతర నాయకులు ప్రసాదరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముదునూరికి అభినందనలు

పెనుగొండ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజును ఆచంట నాయకులు కలిసి అభినందించారు. గురువారం నరసాపురంలోని ప్రసాదరాజు నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైట్ల కిషోర్ కుమార్, వస్కా ఉమేష్, మనవర్తి విజయ్‌కుమార్, శీలం చిట్టియ్య, కోయ రమేష్ పాల్గొన్నారు.

దేశానికి రైతు పెద్దన్న



భగ్గేశ్వరంలో మాట్లాడుతున్న సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకట రాఘవులు

పాలకొల్లు అర్బన్: దేశానికి అన్నం పెట్టే రైతన్న పెద్దన్నలాంటి వాడని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకట రాఘవులు అన్నారు. పాలకొల్లు మండలం భగ్గేశ్వరంలో గురువారం భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా మహా సభ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో వెంకట రాఘవులు మాట్లాడుతూ రైతులకు, కౌలు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు అతీతంగా రైతు సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్గానిక్ ప్రముఖ్ భూపతిరాజు రామకృష్ణంరాజు మాట్లాడుతూ అధిక వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన అన్ని రకాల పంటలకు సంబంధించి రైతులు, కౌలు రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు గంటా నాగరాజు, కార్యదర్శిగా తొంటా సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు దోసూరి రాము, గడగొట్టు శ్రీరాంబాబు, ఆర్ కొండబాబు, కొలూరి పతిరాజు, కనుమూరి శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా వేదిక కార్యక్రమాలు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో శుక్రవారం నుంచి 26 వరకూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పితాని కార్యాలయ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో 20వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు పెనుగొండలో, 21న సిద్ధాంతంలో, 22న ఆంచట మండల కోడేరు, 23న ఆచంట వేమవరం, 24న పోడూరు మండలం గుమ్మలూరు, 2న పెనుమంట్ర మండలం మాముడూరు, 26న మార్టేరులోనూ నిర్వహించనున్నట్లు వివరించారు.

సుందరీకరణలో మునిసిపాలిటీ నిర్లక్ష్యం



మట్టిదిబ్బలతో దర్శనమిస్తున్న లాకురోడ్డు

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడి రోడ్డు, అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి నిర్మించిన ప్లాట్‌ఫామ్ రెయిలింగ్ ధ్వంసమైంది. కొండాలమ్మ గుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ చోరుల పాలవుతోంది. ముఖ్యంగా గోదావరి బండ్‌కు వెళ్లే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రోడ్డు పక్కన మట్టిదిబ్బలు దర్శినమిస్తున్నాయి. రోడ్డు వెంబడి ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పరిస్థితిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

స్వర్ణాంధ్ర విద్యార్థులకు టీసీఎస్‌లో ఉద్యోగాలు



విద్యార్థులకు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ కంపెనీ టీసీఎస్ లో ఉద్యోగాలు లభించాయి. ఈ విషయాన్ని గురువారం కళాశాల యాజమాన్యం విలేకరులకు తెలిపింది. కళాశాలలోని ఏఐ అండ్ ఎంఎల్ విభాగానికి చెందిన విద్యార్థులు నాగ ధనలక్ష్మి, జాహ్నవిశ్రీ నిఖిల, ఏపీఎల్ సాయిరాం, ఇంద్రజ, ఎం.లక్ష్మీ శివ పార్వతి, వీసీడీ సత్యప్రకాష్, టీఎస్ఎస్ సూర్యనారాయణ ఉద్యోగాలు పొందారన్నారు. వీరందరినీ కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాద్, అడ్డాల శ్రీహరి, పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.సురేష్‌కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏ గోపీచంద్, ఏఐ అండ్ ఎంఎల్ విభాగాధిపతి బొమ్మ రామకృష్ణ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగొండ: పెనుగొండ మండల పరిధిలో విద్యుత్ శాఖ నిర్వహణ పనులతో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి.సురేష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పెనుగొండ, వడలి గ్రామాలలో సరఫర నిలిచిపోతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి కొప్పర్రు ఫీడర్‌పై శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలుపుదల చేస్తున్నామని, ఎలక్ట్రికల్ సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పెదగరువు, దిగమర్రు, కొత్తపేట, వరిధనం, పెదమామిడిపల్లి, లయన్స్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ఆకుకూరల్లో పోషక విలువలు



పెదమామిడిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పెదమామిడిపల్లిలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లేశ్వరి పాల్గొని గర్భిణులు, బాలింతలకు, గర్భిణులకు పలు సూచనలు చేశారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరల్లో అనేక రకాల పోషక విలువలు ఉంటాయన్నారు. ముఖ్యంగా మునగాకులో అధిక పోషక విలువలు ఉంటాయన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు జి.నాగజ్యోతి, జి.గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరంగనాథరాజు జన్మదిన వేడుకలు



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆచంట నియోజకవర్గ నాయకులు

పెనుగొండ: మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆచంట నియోజకవర్గం నుంచి అభిమానులు, కార్యకర్తలు గురువారం తాడేపల్లిగూడెంలోని శ్రీరంగనాథరాజు నివాసానికి భారీగా తరలి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం వరకూ రంగనాథరాజుకు శుభాకాంక్షలు తెలపడానికి బారులు తీరారు. కార్యకర్తలు అభిమానులతో పాటు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఎంపీపీలు పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, నాయకులు పోడూరి రామయ్య, కర్రి వేణుబాబు, మండల సర్పంచ్‌ల ఛాంబర్స్ అధ్యక్షులు సుంకర సీతారామ్, గుబ్బల ఉషారాణీ వీర బ్రహ్మం తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి క్రీడా సంబరాలు

ఆకివీడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు మండలంలోని సిద్ధాపురం జెడ్పీ స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తామని మండల క్రీడా సమన్వయ కర్త, పీఈటీ జి.మోహన్ బుధవారం చెప్పారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం, యోగా, షటిల్, బ్యాడ్మింటన్, అథ్లెంటిక్స్‌లో పోటీలు నిర్వహిస్తారన్నారు. అండర్-14 విభాగంలో పాల్గొనే బాల బాలికలు 1.1.2011 తర్వాత జన్మించిన వారై ఉండాలని, అండర్-17 విభాగంలో పాల్గొనే వారు 1.1.2008 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవాలు



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

పెనుగొండ: సిద్ధాంతం మేడిశెట్టి వారి వీధి గణేష్ యూత్ ఆధ్వర్యంలో గురువారం గణేష్ నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. బుట్టబొమ్మల నృత్యాలు, బాణసంచాకాల్పులతో గ్రామోత్సవం నిర్వహించారు. డీజే సౌండ్స్‌తో హోరెత్తించారు. అనంతరం వశిష్టాగోదావరిలో నిమజ్జనం చేశారు. అలాగే చెరుకువాడ బీసీ కమ్యూనిటీ హాలు వద్ద చిట్టూరి వారి వీధి గణేష్ నిమజ్జనోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం నరసాపురం కాలువలో నిమజ్జనం చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెనుగొండ ఎస్సై కె.గంగాధర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నరసాపురంలో...

నరసాపురం రూరల్: గణేష్ నిమజ్జనోత్సవాల ముగింపు వేడుకలను పురస్కరించుకుని గురువారం మండలంలోని పలు గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు భారీగా నిర్వహించారు. లక్ష్మణేశ్వరం, వేములదీవి, సీతారామపురం తదితర గ్రామాల్లో భారీగా వినాయకుడిని ట్రాక్టర్లపై పుర వీధుల్లో ఊరేగించడంతో పాటు మేళతాళాలతో భారీ బాణసంచా సామగ్రిని పేలుస్తూ గణపతి బప్పా మోరియా, జై గణేష్, జైజై గణేష్ అంటూ నినాదాలు చేస్తూ పురవీధుల్లో నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని కోవెలగుడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన గణేషుని ప్రతిమను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగింపుగా వశిష్టగోదావరిలో నిమజ్జనం చేశారు.